‘ప్రజాపాలన’కు సర్వం సిద్ధం

జనవరి 6 వరకు ఆరు గ్యారంటీలకు దరఖాస్తుల స్వీకరణ

- నియోజకవర్గాలకు స్పెషల్ ఆఫీసర్లుగా జిల్లాస్థాయి అధికారులు
- మండలాల్లో పర్యవేక్షకులుగా తహసీల్దార్‌లు, ఎంపీడీఓలు
- 13 పురపాలక సంఘాలు, 61 జీపీల్లో సభల నిర్వహణకు 306 బృందాలు



సాక్షి, మేడ్చల్ జిల్లా: ప్రజలకు పాలన చేరువ చేసేందుకు తెలంగాణ ప్రభుత్వం గురువారం నుంచి వచ్చేనెల 6వ తేదీ వరకు నిర్వహించనున్న ‘ప్రజా పాలన’ కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించేందుకు జిల్లా అధికార యంత్రాంగం సర్వం సన్నద్ధమైంది. మేడ్చల్-మల్కాజిగిరి జిల్లాలో అర్హులైన లబ్ధిదారులకు దశలవారీగా, నిర్ణీత వ్యవధిలో సామాజిక భద్రత కార్యక్రమాలు, సంక్షేమ పథకాలను ఆరు గ్యారంటీల్లో భాగంగా అందజేసేందుకు ప్రజాపాలన కార్యక్రమంలో భాగంగా నిర్వహించే గ్రామ పంచాయతీలు, వార్డు/డివిజన్ సభల్లో ప్రజల నుంచి దరఖాస్తులను స్వీకరించేందుకు సంబంధిత అధికారులు ఏర్పాట్లు పూర్తి చేశారు. ప్రభుత్వ సెలవు దినాలు మినహాయించి మిగతా ఎనిమిది రోజుల్లో ప్రతిరోజూ రెండు షిఫ్టుల్లో ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు, మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు గ్రామ పంచాయతీలు, మున్సిపల్ వార్డులు/డివిజన్లలో ప్రజాపాలన సభలు జరిగేలా అధికార యంత్రాంగం కార్యాచరణ కార్యక్రమాన్ని రూపొందించింది. క్షేత్రస్థాయిలో జవాబుదారితనం, పారదర్శకతతో కూడిన మెరుగైన పరిపాలనను ప్రజాభిప్రాయానికి అనుగుణంగా అందించడమే లక్ష్యంగా నాలుగు నెలలకు ఒకసారి ప్రజాపాలన కార్యక్రమాన్ని నిర్వహించేందుకు ప్రభుత్వ ఆదేశాల అనుగుణంగా జిల్లా యంత్రాంగం రూపకల్పన చేసింది.

ఈ పథకాలకు మాత్రమే.. దరఖాస్తుల స్వీకరణ..

ప్రజాపాలన కార్యక్రమంలో భాగంగా పురపాలక సంఘాలు, గ్రామ పంచాయతీల్లో నిర్వహించే సభలో మహాలక్ష్మీ, రైతు భరోసా, గృహజ్యోతి, ఇందిరమ్మ ఇళ్లు, చేయూత పథకం, యువ వికాసం తదితర పథకాలకు అర్హులైన ప్రజల నుంచి సంబంధిత అధికారులు దరఖాస్తులు తీసుకుంటారు. సభల్లో దరఖాస్తుల స్వీకరణ కోసం మహిళలు, పురుషులకు ప్రత్యేక క్యూలతో పాటు కౌంటర్లను ఏర్పాటు చేసేందుకు అధికార యంత్రాంగం చర్యలు తీసుకుంటోంది. భారీ సంఖ్యలో దరఖాస్తు దారులు ఉన్నట్లయితే.. టోకెన్ విధానాన్ని అధికారులు అనుసరిస్తారు.

నియోజకవర్గాలకు స్పెషల్ ఆఫీసర్లు..

ప్రజాపాలన కార్యక్రమంలో భాగంగా గ్రామాలు, పురపాలక సంఘాల్లో సభల విజయవంతానికి ప్రభుత్వ ఆదేశాల మేరకు జిల్లా అధికార యంత్రాంగం ప్రతీ అసెంబ్లీ నియోజకవర్గానికి జిల్లాస్థాయి అధికారిని స్పెషల్ ఆఫీసర్‌గా నియమించింది. అందులో భాగంగానే మేడ్చల్ అసెంబ్లీ నియోజకవర్గానికి స్పెషల్ ఆఫీసర్‌గా జెడ్పీ సీఈఓ దేవసహాయం, ఉప్పల్‌కు యువజన, క్రీడా విభాగం అధికారి బలరామారావు, కుత్బుల్లాపూర్ నియోజకవర్గానికి బీసీ సంక్షేమ శాఖ జిల్లా అధికారి కేశురామ్, కూకట్‌పల్లి అసెంబ్లీ నియోజకవర్గానికి ఎస్సీ అభివృద్ధి శాఖ జిల్లా అధికారి వినోద్‌కుమార్, మల్కాజిగిరి అసెంబ్లీ నియోజకవర్గానికి స్పెషల్ ఆఫీసర్‌గా ఎస్సీ కార్పొరేషన్ ఈడీ బాలాజీని నియమించారు. ఈ స్పెషల్ ఆఫీసర్లు తమ నియోజకవర్గం పరిధిలోని గ్రామ పంచాయతీ, పురపాలక సంఘాల్లో సభలకు ఎలాంటి అవాంతరాలు జరగకుండా విజయవంతంగా జరిగేలా చర్యలు తీసుకుంటారు. సభలకు హాజరయ్యే ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అవసరమైన వసతుల కల్పనకు కృషి చేస్తారు.

సభల సక్సెస్‌కు 306 టీమ్‌లు

ప్రజాపాలన సభలు సక్సెస్ కావడానికి జిల్లా అధికార యంత్రాంగం 306 టీమ్‌లను నియమించింది. జిల్లాల్లోని 61 గ్రామ పంచాయతీల్లో సభలకు నిర్వహణకు 10 టీమ్‌లను ఖరారు చేసిన అధికార యంత్రాంగం.. 13 పురపాలక సంఘాల పరిధిలోని 289 వార్డులు/డివిజన్లలో సభలు నిర్వహించేందుకు 296 టీమ్‌లను ఏర్పాటు చేశారు. పురపాలక సంఘాల్లో సభల సక్సెస్ కోసం మండల తహసీల్దార్లు, గ్రామ పంచాయతీల్లో సభల విజయవంతానికి ఎంపీడీఓలు పర్యవేక్షకులుగా వ్యవహరిస్తారు.

జనవరి 6 వరకు దరఖాస్తుల స్వీకరణ

కూకట్‌పల్లి: తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టనున్న ప్రజాపాలన కార్యక్రమం ఈనెల 28 నుంచి జనవరి 6వ తేదీ వరకు సెలవు దినాలను మినహాయిస్తే ప్రతి రోజు నిర్వహించనున్నట్లు కూకట్‌పల్లి జోనల్ కమిషనర్ ఓ ప్రకటనలో తెలిపారు. ఈ ప్రజాపాలనలో రాష్ట్ర ప్రభుత్వ ఆరు గ్యారంటీ పథకాలు, సాధారణ సమస్యలకు సంబంధించిన అప్లికేషన్స్ స్వీకరించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమం ప్రతి వార్డులోనూ 4 ప్రాంతాల్లో నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో స్పెషల్ ఆఫీసర్లు, డిప్యూటీ కమిషనర్ల పర్యవేక్షణలో ప్రతి సెంటర్‌కి ఒక టీం లీడర్, టీం మెంబర్‌లతో కౌంటర్లు, ప్రత్యేకంగా మహిళలకు ఒక జనరల్ కౌంటర్‌లో సాధారణ సమస్యలకు ఉపయోగించుకోవచ్చన్నారు. 28వ తేదీ ఉదయం 8గంటలకు ప్రజాపాలన కార్యక్రమం ప్రారంభించనున్నట్లు తెలిపారు.

ప్రజాపాలనకు ఏర్పాట్లు పూర్తి

బాలానగర్: తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన ప్రజాపాలనకు అధికార యంత్రాంగం కసరత్తు పూర్తి చేసింది. నేటి నుంచి జనవరి 6వ వరకు అన్ని మున్సిపాలిటీ వార్డుల్లో గ్రామ సభలు నిర్వహించనున్నట్లు బాలానగర్, ఫతేనగర్ కార్పొరేటర్లు ఆవుల రవీందర్‌రెడ్డి, పండాల సతీష్‌గౌడ్‌లో ఓ ప్రకటనలో తెలిపారు. మహాలక్ష్మి, రైతు భరోసా, ఇందిరమ్మ ఇళ్లు, గృహజ్యోతి, చేయూత వంటి పథకాలకు దరఖాస్తులు చేసుకోవాలని కోరారు. ఫతేనగర్ డివిజన్ పరిధిలోని ఫతేనగర్ వార్డు కార్యాలయం, భరత్‌నగర్ పార్కు బిల్డింగ్, భగత్‌సింగ్ పార్కు కమ్యూనిటీహాల్, ఇందిరాగాంధీపురం ఫంక్షన్‌హాల్‌లో దరఖాస్తు అందజేయాలన్నారు. అదే విధంగా బాలానగర్ డివిజన్‌లో శ్రీశ్రీనగర్ కమ్యూనిటీహాల్, దిల్‌కుష్‌నగర్ కమ్యూనిటీహాల్, రాజుకాలనీ కమ్యూనిటీహాల్, ఫిరోజ్‌గూడ వార్డు కార్యాలయంలో ప్రజాపాలన కార్యక్రమం నిర్వహించనున్నట్లు తెలిపారు.

నేటి నుంచి ప్రజాపాలన ప్రారంభం

ఓల్డ్‌బోయిన్‌పల్లి డివిజన్‌లో 4 సెంటర్ల ఏర్పాటు

సంక్షేమ పథకాలకు దరఖాస్తు చేసుకోవాలని కార్పొరేటర్ వినతి

ఓల్డ్‌బోయిన్‌పల్లి: తెలంగాణ రాష్ట్రంలో నూతనంగా ఏర్పాడిన కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం ప్రజలకు కోసం అందిస్తున్న సంక్షేమ పథకాలకు అర్హులా ఎంపికకు ప్రజాపాలన దరఖాస్తుల స్వీకరణకు డివిజన్‌లో 4 సెంటర్లను ఏర్పాటు చేశారు. ఈ సెంటర్లలో రోజు వారీగా వివిధ కాలనీలు, బస్తీవాసుల నుంచి ప్రజాపాలన దరఖాస్తులను స్వీకరిస్తారని.. అందుకే ప్రతి ఒక్కరూ దరఖాస్తు చేసుకోవాలని కార్పొరేటర్ ముద్దం నర్సింహయాదవ్ కోరారు.

గంగపుత్ర సంఘం సెంటర్ పరిధిలో..

- గురువారం రామరాజునగర్ కాలనీ, శుక్రవారం పీవీ ఎన్‌క్లేవ్, శనివారం స్వర్ణాదామనగర్ ఎల్‌బీనగర్, సోమవారం కోయబస్తీ, గంగపుత్ర సంఘం, మంగళవారం గౌరినగర్, మణికంఠ కాలనీ, ◆ బుధవారం నాగిరెడ్డి కాలనీ, వెస్లీ టీచర్స్‌కాలనీ, గురువారం ఆనంద్‌కాలనీ, వెస్లీ టీచర్స్ కాలనీ, శుక్రవారం ఆర్ఆర్‌టౌన్‌షిప్, మైత్రీవన్ కాలనీ.

బోయిన్‌పల్లి వార్డు కార్యాలయం పరిధిలో...

- గురువారం శ్రీసాయి ఎన్‌క్లేవ్, మల్లికార్జునకాలనీ, శుక్రవారం బడేగూడ, విటల్ ఎన్‌క్లేవ్ శనివారం కుమ్మరి బస్తీ, బోయిన్‌పల్లి, హరిజన బస్తీ, సోమవారం శంకర్ ఎన్‌క్లేవ్, సిండికేట్ బ్యాంక్ కాలనీ, మంగళవారం యాదిరెడ్డి కాలనీ, నారాయణపురి కాలనీ, బుధవారం వల్లబ్‌నగర్, గురువారం హెచ్ఏఎల్ కాలనీ, శుక్రవారం ఆర్ఆర్ నగర్.

మోడల్ మార్కెట్ సెంటర్ పరిధిలో...

- గురువారం మనసా సరోవర్ హైట్స్, సాయిసాగర్ ఎన్‌క్లేవ్. శుక్రవారం ముస్లిం బస్తీ, ఫాతిమా మోస్కి, శనివారం సిండికేట్ బ్యాంక్ ఆఫీసర్స్ కాలనీ. సోమవారం వడ్డేర బస్తీ, హస్మత్‌పేట విలేజ్. మంగళవారం హరిజన బస్తీ, బుధవారం లైన్స్ టౌన్ కాలనీ. గురువారం సాయిక్రిష్ణకాలనీ, శుక్రవారం ఎస్ఆర్ఎస్ఏ క్వార్టర్స్.

ఆంజయ్యనగర్‌కాలనీ కమ్యూనిటీ హాల్ పరిధిలో..

- గురువారం పార్కు విల్లా, శుక్రవారం ఆంజయ్యనగర్, శనివారం గొల్లకుర్మ సంఘం. సోమవారం అబ్రహార్‌నగర్, మాలబస్తీ, మంగళవారం జయశంకర్‌నగర్ బుధవారం మనో వికాస్‌నగర్, గురువారం వైశ్యాబ్యాంక్ కాలనీ, శుక్రవారం దుబాయిగేట్.
- ఈ ప్రాంతాల ప్రజలు ప్రజాపాలన దరఖాస్తులను అందించాల్సి ఉంటుందన్నారు. ఈ సెంటర్లలో తహసీల్దార్ స్థాయి అధికారి బృందంతో పాటు వివిధ శాఖల అధికారులు ఉంటారని పేర్కొన్నారు. అధికారులు ఇచ్చే రశీదులను జాగ్రత్తగా దాచుకోవాలని కోరారు.

ట్రాఫిక్ కేసులు లోక్ అదాలత్‌లో పరిష్కరించుకోండి

కూకట్‌పల్లి ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ నగేష్



మూసాపేట: ట్రాఫిక్ కేసులు ఉన్నవారు లోక్ అదాలత్‌లో పరిష్కరించుకోవాలని కూకట్‌పల్లి ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ నగేష్ అన్నారు. బుధవారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ... కూకట్‌పల్లి ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్ పరిధిలో సుమారు 5వేల కేసులు ఉన్నాయని అన్నారు. ఇప్పటి వరకు 159 కేసులు పరిష్కారం అయ్యాయని తెలిపారు. ఈనెల 30వ తేదీ వరకు జరిగే లోక్ అదాలత్‌లో డ్రంక్ డ్రైవ్, లైసెన్స్ లేకుండా డ్రైవింగ్ చేసిన కేసులు ఉన్నవారు తమ ఆధార్‌కార్డు, ఆర్‌సీ, లైసెన్స్ తీసుకొని కూకట్‌పల్లి పోలీస్‌స్టేషన్‌కు రావాలని సూచించారు. కోర్టులో చలాన్ కట్టి పరిష్కరించుకోవాలని సూచించారు. ట్రాఫిక్ చలాన్‌లు తమ వాహనాలపై పెండింగ్‌లు కూడా 60 శాతం ఆఫర్ ఉన్నప్పుడే కట్టుకోవాలని సూచించారు. డ్రంకన్ డ్రైవ్ కేసులు ఉంటే ఉద్యోగాలు, పాస్‌పోర్ట్ సమయంలో ఇబ్బందులు ఎదుర్కొంటారని తెలిపారు. లోక్ అదాలత్ ఉన్నప్పుడే కోర్టులో చలాన్ కట్టి పరిష్కరించుకోవాలని ఆయన కోరారు.

సామాజిక కార్యకర్త అంజిరెడ్డికి సన్మానం



మోతీనగర్: ప్రతి వ్యక్తి కొంత సమయాన్ని సేవ చేయటానికి కేటాయించినట్లయితే సమాజం మరింత అభివృద్ధి చెందుతుందని రాష్ట్ర సాంస్కృతిక శాఖ డైరెక్టర్ మామిడి హరికృష్ణ పేర్కొన్నారు. బుధవారం రవీంద్రభారతిలో సుమధుర ఆర్ట్స్ వార్షికోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా నాట్య కళాకారులు, వివిధ రంగాల్లో సేవ చేసిన సామాజిక కార్యకర్తలను మెమొంటో అందజేసి శాలువాతో సత్కరించారు. మూసాపేట డివిజన్ మోతీనగర్‌కు చెందిన సామాజిక సేవా కార్యకర్త నలమాల్పు అంజిరెడ్డిని శాలువాతో సన్మానించి అవార్డు అందజేశారు. తనకు సుమధుర ఆర్ట్స్ సంస్థ అవార్డు ఇచ్చినందుకు నిర్వాహకులకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

హెచ్‌సీయూలో అంతర్జాతీయ సదస్సు

- జనవరి 18 నుంచి 20 వరకు నిర్వహణ

రాయదుర్గం: సుస్థిర అభివృద్ధి లక్ష్యాలపై ప్రపంచ వ్యాప్తంగా, విభాగాలలో విస్తృతశ్రేణి నిపుణులనుఒక చోట చేర్చడానికి ప్రత్యేక ప్రయత్నం జరుగుతోంది. అందులో భాగంగా గచ్చిబౌలిలోని హైదరాబాద్ సెంట్రల్ యూనివర్శిటీలో గోల్డెన్ జూబ్లీ వేడుకల్లో భాగంగా జనవరి 18 నుంచి 20వ తేదీ వరకు సస్టేనబుల్ డెవలప్‌మెంట్ గోల్స్(ఎస్‌డీజీ)పై అంతర్జాతీయ సదస్సును నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. ఈ సదస్సులో భారతదేశం నలుమూలల నుంచే కాకుండా విదేశాల నుంచి కూడా పలువురు ఈ కార్యక్రమంలో భాగస్వాములు కానున్నారు.

సీఆర్ ఫౌండేషన్‌లో ముగ్గుల పోటీలు

హఫీజ్‌పేట్: సంక్రాంతి పర్వదినాన్ని పురస్కరించుకొని కొండాపూర్‌లోని సీఆర్ ఫౌండేషన్‌లో మహిళలకు ముత్యాల ముగ్గుల పోటీలు ఫ్రెండ్స్ వెల్ఫేర్ అసోసియేషన్, కొమిరిశెట్టి ఫౌండేషన్ సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించారు.అనంతరం విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో కల్పన, సరోజ, సర్వసతి, ఫ్రెండ్స్ వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులు మల్లేష్, విష్ణు ప్రసాద్, జనార్ధన్, మహిళా నాయకురాలు వాణి సాంబశివావు, రొటేరియన్ విజయలక్ష్మి పాల్గొన్నారు.

ఆరు గ్యారంటీలకు దరఖాస్తు చేసుకోండి



మూసాపేట మున్సిపల్ కార్యాలయంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు, అధికారులు రాజేంద్రనాయక్, శంకరయ్య

కూకట్‌పల్లి: మూసాపేట మున్సిపల్ కార్యాలయంలో బుధవారం ప్రజాపాలన కార్యక్రమంలో భాగంగా సమావేశం నిర్వహించారు. ఈ సమీక్షలో కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు, చీఫ్ సిటీ ప్లానర్ రాజేంద్ర నాయక్, నోడల్ అధికారి శంకరయ్య పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ... నియోజకవర్గ ప్రజలు తమ తమ డివిజన్ల పరిధిలో ఏర్పాటు చేసిన కార్యాలయంలో పథకానికి సంబంధించిన దరఖాస్తులు అధికారులకు అందజేయాలని కోరారు. దరఖాస్తులు స్వీకరించే అధికారులు రశీదు ఇస్తారన్నారు. ప్రభుత్వం ప్రవేశపెట్టిన మహాలక్ష్మి, గ్యాస్ సిలిండర్, గృహజ్యోతి, 200 యూనిట్ల కరెంటు రాయితీ, ఇందిరమ్మ ఇల్లు, చేయూత (ఫించన్లు) వంటి పథకాలకు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ప్రజలు ఇబ్బందులు కలగకుండా అన్ని ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్లు, మున్సిపల్ అధికారులు, పోలీస్, అన్ని విభాగాల అధికారులు, డీసీలు రమేష్, కృష్ణయ్య తదితరులు పాల్గొన్నారు.

ప్రతి కార్యకర్తను కంటికి రెప్పలా చూసుకుంటా

బీఆర్ఎస్ కార్యకర్తల ఆత్మీయ సమావేశంలో ఎమ్మెల్యే గాంధీ



సమావేశంలో మాట్లాడుతున్న శేరిలింగంపల్లి ఎమ్మెల్యే అరెకపూడి గాంధీ

ఆల్విన్‌కాలనీ: శేరిలింగంపల్లి నియోజకవర్గం నుంచి భారీ మెజార్టీతో మూడోసారి ఎమ్మెల్యేగా గెలుపొందిన అరెకపూడి గాంధీ బీఆర్ఎస్ కార్యకర్తలతో బుధవారం ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో నియోజకవర్గంలోని బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలుతో పాటు కార్పొరేటర్లు హమీద్ పటేల్, రాగం నాగేందర్ యాదవ్, ఉప్పలపాటి శ్రీకాంత్, మంజుల రఘునాథ్‌రెడ్డి, మాజీ కార్పొరేటర్ సాయిబాబా తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే గాంధీ మాట్లాడుతూ.. తన మీద విశ్వాసం ఉంచి మూడోసారి ఎమ్మెల్యేగా భారీ మెజార్టీతో గెలిపించిన శేరిలింగంపల్లి నియోజకవర్గ ప్రజలకు కృతజ్ఞతలు తెలుపుతున్నామని అన్నారు. ప్రతి ఒక్క కార్యకర్తను కంటికి రెప్పలా చూసుకుంటామని, ప్రతి ఒక్కరు కష్టపడి బీఆర్ఎస్‌ని బలోపేతం చేద్దామన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ కౌన్సిలర్లు, బీఆర్ఎస్ డివిజన్ అధ్యక్షులు, నాయకులు, కార్యకర్తలు, అనుబంధ సంఘాల ప్రతినిధులు, అభిమానులు, వివిధ కాలనీ వాసులు, తదితరులు పాల్గొన్నారు.



ఎమ్మెల్యేకు శుభాకాంక్షలు తెలుపుతున్న హెచ్ఎంటీహిల్స్ కాలనీ సభ్యులు

ఎమ్మెల్యే గాంధీకి శుభాకాంక్షలు

భాగ్యనగర్‌కాలనీ: ఇటీవల జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో శేరిలింగంపల్లి నియోజకవర్గం నుంచి మూడోసారి హ్యాట్రిక్ సాధించిన సందర్భంగా బుధవారం హెచ్ఎంటీహిల్స్ కాలనీ అసోసియేషన్ సభ్యులు ఎమ్మెల్యే అరెకపూడి గాంధీకి పుష్పగుచ్ఛాలు అందజేసి, శాలువాతో సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. తన విజయానికి పాటుపడిన ప్రతి ఒక్కరికి కృతజ్ఞతలు తెలుపుతున్నానని అన్నారు. మరింత బాధ్యతగా శేరిలింగంపల్లి నియోజకవర్గ అభివృద్ధికి కృషి చేస్తానని తెలిపారు.

వీవ్స్ అండ్ క్రాఫ్ట్ హ్యాండ్లూమ్ వస్త్ర ప్రదర్శన ప్రారంభం



ప్రదర్శనను ప్రారంభిస్తున్న మేయర్ నీలారెడ్డి, గాయత్రి వేదాంతం, నిర్వాహకురాలు శ్రీలత

భాగ్యనగ్‌కాలనీ: నిజాంపేటలోని కొలన్ రాఘవరెడ్డి గార్డెన్స్‌లో ఏర్పాటైన కృతి వీవ్స్ అండ్ క్రాఫ్ట్స్ హ్యాండ్లూమ్ వస్త్ర ప్రదర్శన నిజాంపేట మేయర్ నీలా గోపాల్‌రెడ్డి, నేపథ్య గాయని గాయత్రి వేదాంతంలు కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా మేయర్ నీలా గోపాల్‌రెడ్డి, గాయత్రిలు చేనేత కళాకారులు తయారు చేసిన వస్త్ర ఉత్పత్తులు తిలకిస్తూ, చేనేత కళాకారుల నుంచి వాటి తయారీ విధానం, ప్రత్యేకతను కళాకారుల నుంచి అడిగి తెలుసుకున్నారు. భారతీయ సంస్కృతిలో సిల్క్, హ్యాండ్లూమ్ వస్త్ర ఉత్పత్తులకు ఎంతో ప్రత్యేకత ఉందని నీలా గోపాల్ అన్నారు. ఈ ఉత్పత్తులకు నేటికీ వన్నె తగ్గలేదన్నారు. నేటి తరం యువతలో కూడా హ్యాండ్లూమ్ ఉత్పత్తులను ఆదరిస్తున్నారన్నారు.

- నేపథ్య గాయని గాయత్రి మాట్లాడుతూ.. హ్యాండ్లూమ్ ఉత్పత్తుల తయారీకి చేనేత కారుల శ్రమ వెల కట్టలేనిదన్నారు. ప్రతి ఒక్కరూ చేనేతను ఆదరించాలన్నరు. అప్పుడే చేనేత కళాకారుల కష్టానికి తగ్గ ఫలితం పరోక్షంగా ఇవ్వగలమన్నారు.
- ఈ సందర్భంగా నిర్వాహకురాలు యలమంచిలి శ్రీలత మాట్లాడుతూ.. జనవరి 1 తేదీ వరకు కొనసాగనున్న ప్రదర్శనలో దేశంలోని 16 రాష్ట్రాల నుంచి చేనేత కళాకారులు, చేతి పని బృందాలు తమ సిల్క్ హ్యాండ్లూమ్ చీరలు, డ్రెస్ మెటీరియల్ వంటి 75 వేల రకాల వస్త్ర ఉత్పత్తులను అందుబాటులో ఉంచారని వివరించారు.

జనవరి 17 వరకు ట్రాఫిక్ మళ్లింపు

గచ్చిబౌలి: వరద నీటి డ్రెయిన్, సీసీ రోడ్డు నిర్మాణ పనుల నేపథ్యంలో ట్రాఫిక్‌ను మళ్లిస్తున్నట్లు మాదాపూర్ ఇంచార్జ్ ట్రాఫిక్ డీసీపీ డీవీవీ శ్రీనివాస్‌రావు తెలిపారు. మణికొండలో సన్‌రైజ్ రెగ్యులాస్ వద్ద వరద నీటి డ్రెయిన్, సీసీ రోడ్డు పనులు జరుగుతున్న క్రమంలో రోడ్డును మూసివేస్తున్నట్లు తెలిపారు. ఈ నెల 29 నుంచి జనవరి 17వ తేదీ వరకు పనులు జరుగుతాయని తెలిపారు. మణికొండ మర్రి చెట్టు నుంచి రాయదుర్గం వైపు వచ్చే వాహనదారులు పంచవటి కాలనీ, మల్కంచెరువు, లింక్ రోడ్డు, ఓల్డ్ ముంబై జాతీయ రహదారికి వెళ్లాలని సూచించారు. రాయదుర్గం నుంచి మణికొండ మర్రిచెట్టు వైపు వెళ్లే వాహనాలు ట్రయల్ విల్లాస్ పక్క రోడ్డులో వెళ్లి హుడా కాలనీ మెయిన్‌రోడ్డు, శ్రీజాస్ హోమ్ ఫుడ్ వద్ద కుడి వైపు తిరిగి షేక్‌పేట్ ప్రధాన రహదారికి చేరుకుంటారు. మణికొండ ఆంధ్రా బ్యాంక్ వద్ద రైట్ టర్న్ తీసుకొని మర్రి చెట్టు రోడ్డుకు వెళ్లవచ్చన్నారు. ట్రాఫిక్ మళ్లింపును వాహనదారులు గమనించాలని ఆయన సూచించారు.

ప్రతి కార్యకర్తకు రుణపడి ఉంటా

ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు

ఓల్డ్‌బోయిన్‌పల్లి: కూకట్‌పల్లి నియోజకవర్గం ఎమ్మెల్యేగా మూడోసారి భారీ మెజార్టీతో గెలిపించిన ప్రజలకు రుణపడి ఉంటానని ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు తెలిపారు. బుధవారం ఓల్డ్ బోయిన్‌పల్లి డివిజన్ శంకర్ ఎన్‌క్లేవ్‌లో స్థానిక కార్పొరేటర్ ముద్దం నర్సింహయాదవ్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. కూకట్‌పల్లి నియోజకవర్గంలో తాను చేసిన అభివృద్ధి.. ప్రజలకు చేసిన సేవ, సంక్షేమ పథకాలతో తనను భారీ మెజార్టీతో గెలిపించారని అన్నారు. తన విజయానికి చేసిన కృషికి జీవితాంతం రుణపడి ఉంటానని చెప్పారు. కాలనీ అసోసియేషన్లు, బస్తీవాసులు, పార్టీ నాయకుల అండదండలతో తాను హ్యాట్రిక్ సాధించానని పేర్కొన్నారు. అభివృద్ధి పనులను త్వరితగతిన పూర్తి చేయాలని డీఈ బాలకృష్ణ, ఏఈ అరవింద్‌రావు ఆదేశించారు. ఈ కార్యక్రమంలో నాయకులు నరేందర్‌గౌడ్, మక్కాల నర్సింగ్‌రావు, బల్వంత్‌రెడ్డి, సయ్యద్ ఏజాజ్, హరినాథ్, మన్నే ఉదయ్‌యాదవ్, బల్‌రాం, మక్కాల సత్యనారాయణ, రాజుగౌడ్ లలిత సరోజదేవి తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో పాల్గొన్న కాలనీ అసోసియేషన్ సభ్యులు, ప్రజలు, నాయకులు

నేటి నుంచి గ్రామ సభలు

మూసాపేట: తెలంగాణ ప్రభుత్వం చేపట్టిన ప్రజాపాలనలో భాగంగా గ్రామ సభలు నిర్వహించి అర్హులైన వారిచే అభయ హస్తం గ్యారంటీ పథకాలైన మహాలక్ష్మి, రైతు భరోసా, ఇందిరమ్మ ఇళ్లు, గృహజ్యోతి చేయూతకు దరఖాస్తులను ఈనెల 28 నుంచి జనవరి 6వ తేదీ వరకు స్వీకరించనున్నట్లు మూసాపేట మాజీ కార్పొరేటర్ తూము శ్రావణ్‌కుమార్ తెలిపారు. మూసాపేట వార్డు కార్యాలయం, గాంధీ విగ్రహం వద్ద, రాయలసీమ గ్రౌండ్, భరత్‌నగర్ ఈడబ్ల్యూఎస్, పాండురంగ నగర్ కమ్యూనిటీహాల్, వార్డు కార్యాలయం, మోతీనగర్ మీ సేవ కేంద్రాల వద్ద దరఖాస్తులను స్వీకరిస్తారు. డివిజన్ ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

డివిజన్ ప్రజలు దరఖాస్తు చేసుకోండి

మోతీనగర్: అల్లాపూర్ డివిజన్ వార్డు కార్యాలయంలో ప్రభుత్వం నిర్వహించిన ప్రజా పాలన కార్యక్రమానికి సంబంధించిన సమీక్ష సమావేశంలో కార్పొరేటర్ సబిహా బేగం అన్ని బస్తీ, కాలనీ సంక్షేమ సంఘం సభ్యులతో సమీక్ష సమావేశం బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ... ప్రభుత్వం ప్రవేశపెట్టిన ప్రజాపాలన కార్యక్రమంలో పథకాలకు దరఖాస్తు చేసుకొని రశీదు పొందాలన్నారు.

నేడు కాంగ్రెస్ ఆవిర్భావ దినోత్సవం

కూకట్‌పల్లి: కాంగ్రెస్ పార్టీ 138వ ఆవిర్భావ దినోత్సవాన్ని మూసాపేట జీహెచ్ఎంసీ కార్యాలయం ఎదుట గురువారం నిర్వహించనున్నట్లు కూకట్‌పల్లి పార్టీ ఇన్‌చార్జ్ బండి రమేష్ ఓ ప్రకటనలో తెలిపారు. ఉదయం 9గంటలకు జెండావిష్కరణ ఉంటుందని తెలిపారు.

జనార్ధన్‌రెడ్డి వర్ధంతి..

అదే విధంగా స్వర్గీయ మాజీ ఖైరతాబాద్ ఎమ్మెల్యే పి.జనార్ధన్‌రెడ్డి వర్ధంతిని నిర్వహించనున్నట్లు తెలిపారు. మూసాపేట గూడ్స్‌షెడ్ రోడ్డు, భరత్‌నగర్‌కాలనీ, మోతీనగర్ క్రాస్ రోడ్, బాలానగర్ ప్రాంతాల్లోని పి. జనార్ధన్‌రెడ్డి విగ్రహాలకు నివాళులర్పించనున్నట్లు పేర్కొన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

రాయదుర్గం: గురుకుల పాఠశాలల్లో చేరేందుకు 2024-25 విద్యా సంవత్సరానికి దరఖాస్తులను కోరుతున్నట్లు గౌలిదొడ్డిలోని సాంఘీక సంక్షేమ గురుకుల బాలికల కళాశాల ప్రిన్సిపల్ శారద తెలిపారు. ఇంగ్లీష్ మీడియంలో బోధన ఉంటుందని పేర్కొన్నారు. ప్రస్తుతం 4వ తరగతి చదివే విద్యార్థులు దరఖాస్తు చేసుకోవచ్చని చెప్పారు. విద్యార్థుల ఆధార్‌కార్డు, బోనఫైడ్‌తో పాటు రూ.100 చెల్లించి జనవరి 6వ తేదీలోపు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

మల్కాజ్‌గిరి ఎంపీ అభ్యర్థిని గెలిపించుకోవాలి

కూకట్‌పల్లి కాంగ్రెస్ ఇన్‌చార్జ్ బండి రమేష్



కాంగ్రెస్ ముఖ్య కార్యకర్తల సమావేశంలో మాట్లాడుతున్న బండి రమేష్

కూకట్‌పల్లి: కూకట్‌పల్లి నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీని మరింత బలోపేతం చేసేందుకు ప్రతి కార్యకర్త కృషి చేయాలని కూకట్‌పల్లి కాంగ్రెస్ ఇన్‌చార్జ్ బండి రమేష్ పేర్కొన్నారు. మంగళవారం రాత్రి కూకట్‌పల్లి నియోజకవర్గంలోని కేపీహెచ్‌బీ రోడ్డు నం.1లోని సితార గ్రాండ్ హోటల్‌లో ఏర్పాటు చేసిన ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. రెండు, మూడు నెలల్లో పార్లమెంట్ ఎన్నికలు రాబోతున్నాయని... మల్కాజ్‌గిరి కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిని గెలిపించుకొని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి బహుమతిగా ఇద్దామన్నారు. ఇటీవల జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో కష్టపడి పనిచేసిన కార్యకర్తలకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

ప్రభుత్వ భూముల కబ్జాపై వివరాలు ఇవ్వండి..

- కూకట్‌పల్లి నియోజకవర్గంలో ప్రభుత్వ భూములు ఎక్కడ కబ్జాలు జరిగాయో వాటి పూర్తి వివరాలు సేకరించి ఇవ్వాలన్నారు. ప్రభుత్వం ఈనెల 28 నుంచి ప్రారంభించనున్న ప్రజాపాలన కార్యక్రమంలో పాల్గొని పేదలకు ప్రభుత్వ పథకాలు అందించే విధంగా కృషి చేయాలని పిలుపునిచ్చారు. నిస్వార్థంగా పనిచేసిన కార్యకర్తలను తప్పక గుర్తింపు ఉంటుందన్నారు. ఈనెల 28న కాంగ్రెస్ పార్టీ ఆవిర్భావ దినోత్సవం ప్రతి డివిజన్‌లో జరుపుకొని కాంగ్రెస్ పార్టీ జెండాలను ఎగరవేయాలని తెలిపారు. మూసాపేట మున్సిపల్ కార్యాలయం సమీపంలో గురువారం ఉదయం 9.30 గంటలకు భారీ ఎత్తున పార్టీ జెండా ఆవిష్కరించనున్నట్లు తెలిపారు.
- ఈ కార్యక్రమానికి కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొని విజయవంతం చేయాలన్నారు. అదే విధంగా మాజీ సీఎల్‌పీ నేత పి. జనార్దన్‌రెడ్డి వర్ధంతి సందర్భంగా నివాళులర్పించాలని కోరారు. ఈ కార్యక్రమంలో నాయకులు సత్యం శ్రీరంగం, గాలి బాలాజీ, లక్ష్మయ్య, శేరి సతీష్ రెడ్డి, గొట్టిముక్కల వెంకటేశ్వరరావు, తూము వేణు, తూము సంతోష్ పాల్గొన్నారు.

చిన్న తరహా, సూక్ష్మ పరిశ్రమల సమస్యను పరిష్కరించాలి

సాక్షి,సిటీబ్యూరో: బాలనగరంలోని చిన్న తరహా, సూక్ష్మ పరిశ్రమల సమస్యను పరిష్కరించాలని మైనారిటీ చిన్నతరహా, సూక్ష్మ పరిశ్రమల సంక్షేమ సంఘం ప్రభుత్వానికి విజ్ఞప్తి చేసింది. బుధవారం అధికార కాంగ్రెస్ పార్టీ కూకట్‌పల్లి నియోజకవర్గ ఇన్‌చార్జ్ బండి రమేష్‌ను కలిసి వినితి పత్రం సమర్పించారు. పారిశ్రామిక వాడల్లో నెలకొన్న దీర్ఘకాలి అనేక సమస్యలు నెలకొన్నాయన్నారు. పరిశ్రమలకు ఆర్థిక సాయం కూడా లేకుండా పోయిందన్నారు. ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లి సమస్యలు పరిష్కరించేందుకు కృషి చేస్తానని బండి రమేష్ హామీ ఇచ్చారు. ఫతేనగర్ డివిజన్ కాంగ్రెస్ క్రియాశీల కార్యకర్తలు మహమ్మద్ జహంగీర్, మహమ్మద్ హఫీజ్ పాల్గొన్నారు.